రహ'దారుణం'

కార్పొరేషన్‌గా బడంగ్‌పేట్ అభివృద్ధి చెందింది. కానీ అధ్వాన రోడ్లతో అభాసు పాలవుతోంది. రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు అయినా.. మార్గం మెరుగు పడలేదు. రోడ్డు పనులకు మోక్షం కలిగించాలని ప్రాంత ప్రజలు చేసిన నిరసనలు వృథా అయ్యాయి. నేతలు, అధికారుల హామీలు నీటిమీది రాతలుగానే మిగిలాయి.

- నిధులున్నా.. కదలని నిర్మాణం
- ముందుకు సాగని రోడ్డు విస్తరణ పనులు
- ఫలించని ప్రజల నిరసనలు
- హామీలు మరచిన పాలకులు, అధికారులు
- ఎవరికీ పట్టని వాహనదారుల కష్టాలు


నాదర్‌గుల్ వద్ద రోడ్డు దుస్థితి

బడంగ్‌పేట్: మునిసిపల్ కార్పొరేషన్‌లోని గాంధీ నగర్ టూ నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన రహదారి దారుణంగా ఉంది. ప్రధాన రహదారి అయిన ఈ మార్గం.. నాదర్‌గుల్ మీదిగా ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, అలాగే ఔటర్‌కు లింక్ కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు విస్తరణలో భాగంగా గాంధీనగర్ నుంచి నాదర్‌గుల్ వరకు రూ.9 కోట్లు మంజూరు అయి ఏళ్లు గడుస్తున్నా.. అది నేటి వరకు నెరవేర లేదు. దీంతో పలు రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు గతంలో పలు మార్లు ధర్నాలు చేశారు. దీనికి స్పందించిన కమిషనర్.. వారంలో పనులు చేపట్టి రోడ్డు కష్టాలు తీరుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆందోళనకారులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కొద్దిరోజుల్లో రోడ్డు కష్టాలు తీరతాయని భావించిన వారికి.. అది నిరాశగానే మిగిలింది. వాహనదారుల ఇబ్బంది పడుతూనే ఉన్నారు.

గోతులు ఏర్పడి..

రోడ్డుపై అనేకంగా గోతులు ఏర్పడ్డాయి. వాటిని వదిలేసి, మంచిగా ఉన్న రోడ్డును తవ్వి గుంతలను ఆదే డాంబర్‌తో పూడ్చివేశారు. దీంతో వాటి స్థానంలో గుంతలు ఏర్పడి ఇబ్బందిగా మారిందని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఆందోళనలు చేసిన నేపథ్యంలో వారంలో సమస్య తీరుస్తామని హామీ ఇచ్చిన కమిషనర్ మాటతప్పారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టాలని కోరుతున్నారు.

మొదటి నుంచి వివక్షే

నాదర్‌గుల్ గ్రామం పట్ల కార్పొరేషన్ అధికారులు మొదటి నుంచి వివక్ష చూపుతున్నారు. రూ.9 కోట్లు మంజూరు అయ్యాయి. కౌన్సిల్ తీర్మానం చేసి ఏళ్లు గడిచింది. అయినా రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టడం లేదు. అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇచ్చిన హామీని కమిషనర్ నిలుపుకోవాలి.

– రవికాంత్‌గౌడ్, బీజేపీ నాయకుడు

కలెక్టర్‌కు విన్నవించాం

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి నాదర్‌గుల్ రోడ్డు వేయాలని కలెక్టర్‌కు విన్నవించాం. దీంతో బారీ గుంతలు ఉన్న చోట ప్యాచ్ వర్క్ చేశారు. అక్కడితో వదిలేశారు. రోడ్డు విస్తరణ వెంటనే మొదలు పెట్టాలి. రవాణా మార్గం మెరుగు పర్చాలి.

– సుభాన్‌యాదవ్, కాంగ్రెస్ నేత

వర్షాలతో అంతరాయం



హామీ మేరకు వారంలో రోడ్డు పనులు మొదలు పెడదామని అనుకున్నాము. ఎడతెరపి ముసురు వర్షంతో నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. అక్కడక్కడ ప్యాచ్ పనులు పూర్తి చేశాం. వర్షాలు తగ్గిన వెంటనే విస్తరణ పనులను వేగవంతం చేస్తాం. ప్రజలు సహకరించాలి.

– పి.సరస్వతి, కమిషనర్

క్లుప్తంగా

కమిషనర్‌కు సన్మానం


జ్ఞానేశ్వర్‌ను సత్కరిస్తున్న బీజేపీ నేతలు శ్రీరాములు, భిక్షపతిచారి

మీర్‌పేట: ఉద్యోగ విరమణ పొందిన మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ జ్ఞానేశ్వర్‌ను బుధవారం ఆయన నివాసంలో బీజేపీ కార్పొరేషన్-1 అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై కమిషనర్‌ను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ముఖేష్‌ముదిరాజ్, కీసర గోవర్ధన్‌రెడ్డి, పెండ్యాల నర్సింహ, సోమేశ్వర్, భీంరాజ్, విక్కీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మలక్‌పేట: సామాజిక బాధ్యతగా భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని మలక్‌పేట సెయింట్ జేవీయర్స్ హైస్కూల్ కరస్పాండెంట్ జి. హిజ్కియా అన్నారు. మొక్కలు పెంపకంపై బుధవారం ప్రొఫెసర్స్‌కాలనీ, ఆనంద్‌నగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలని సూచించారు.

కాలనీలో పర్యటన

ఎల్‌బీనగర్: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి అన్నారు.కాలనీలో సమస్యలు పరిశీలించాలని కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు బుధవారం ఆయన గౌతమినగర్ కాలనీలో పర్యటించి నూతన ఓపెన్ జిమ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, కిషన్, నారాయణరావు, రాజ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కేశంపేట: మండల పరిధిలోని లింగంధన గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్ రూ.1.11లక్షల విరాళంను ప్రకటించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళానికి సంబంధించిన నగదును అందించారు. దాతలు ముందుకొచ్చి విరాళాలను అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా దాతను వారు అభినందించారు.

పీర్ల పండుగను ఘనంగా నిర్వహించాలి


ఉత్సవాలకు నగదును అందజేస్తున్న మాజీ సర్పంచ్ నర్సింహులు

షాబాద్: కులమతాలకతీతంగా పీర్ల పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సర్దార్ నగర్ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింలు అన్నారు. బుధవారం సర్దార్‌నగర్‌లో పీర్ల పండుగ ఉత్సవాల సందర్భంగా రూ.5,100ల నగదును ఆయన నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీర్ల పండుగ ఉత్సవాలు ఐకమత్యానికి, మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయన్నారు. సర్వమతసారం ఒక్కటేనని, మానవులందరూ సోదరభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్‌కుమార్, యాదయ్య, కలాం ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం

షాద్‌నగర్‌రూరల్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని టీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని దేవీగ్రాండ్ హోటల్‌లో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై దాటవేత ధోరణి కొనసాగుతోందన్నారు. జర్నలిస్టులు న్యాయమైన పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వాలు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అదేవిధంగా జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని, దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధనే లక్ష్యంగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జర్నలిస్టులు లక్కాకుల రమేశ్‌కుమార్, మల్లేశ్, శ్రీనివాస్, వెంకటయ్య, వహీద్, రామకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

ఇబ్బంది తలెత్తకుండా వ్యాపారం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి


మాట్లాడుతున్న కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: సమస్యలు తలెత్తకుండా వీధి వ్యాపారులు వ్యాపారం చేసుకోవాలని, అందుకు కార్పొరేషన్‌తో పాటు పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని కమిషనర్ పి.సరస్వతి అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో టౌన్ వెండింగ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీధి వ్యాపారులు ఎవరికీ ఇబ్బంది కలకుండా వ్యాపారం కొనసాగించాలని కోరారు. చిరు వ్యాపారాలు బిజినెస్ గ్రీన్ జోన్లుగా ఉండాలని సూచించారు. వారికి ఎల్లప్పుడూ పోలీస్ బందోబస్తుతో పాటు టౌన్ ప్లానింగ్ అనుమతులు ఉంటాయన్నారు. వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా 5 శాతం సబ్సిడీతో రూ.10 వేలు రుణాలను తక్షణమే అందిస్తున్నట్లు వెల్లడించారు. సకాలంలో కార్పొరేషన్‌కు పన్నులు చెల్లించి, అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ జాన్ కృపాకర్, డీఈఈ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, ఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, ఈఈ మౌనిక, మీర్‌పేట్, బాలాపూర్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి


పాఠశాల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ శ్రీరాం కాలనీలోని శ్రీహర్ష టెక్నో పాఠశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, పలు పండుగలు, గిరిజన సంస్కృతి, పంజాబీ డ్యాన్స్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీరాంకాలనీలోని పేద, మధ్య తరగతి వారిని దృష్టిలో ఉంచుకొని లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో విద్యనందించాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు విలువలను కూడా నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఉస్కామూరి నిరంజన్, స్కూల్ కరెస్పాండెంట్ ఉస్కామూరి శిరీషబాలకృష్ణ, మాజీ కౌన్సిలర్ పల్లపు శంకర్, మాజీ కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, స్కూల్ వైస్ చైర్‌పర్సన్ ఉస్కామూరి సుజాత, అకాడమిక్ డీన్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ పి.స్వప్న, వి.విష్ణు, డాక్టర్ సంతోష్, డాక్టర్ అనంత గుప్తా, అంజనేయులు, ఆదిత్య స్కూల్ డైరెక్టర్ పి.సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన


సభా స్థలిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ తదితరులు

మహేశ్వరం: మహేశ్వరం మండల కేంద్రంలో మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ తయారీ పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్ హాజరవుతున్నారని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పరిశ్రమ వద్ద ఏర్పాటు చేస్తున్న సీఎం సభా వేదికను ఆయన స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు పోలీసులు, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నేనావత్ రాజునాయక్, ఎడ్మ మోహన్‌రెడ్డి, లాజర్, మద్ది కరుణాకర్‌రెడ్డి, సత్యనారాయణ, నడికూడ శివ పలువురు పాల్గొన్నారు.

కళాశాలల బంద్ విజయవంతం

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

చేవెళ్ల: కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన 72 గంటల బంద్ మొదటిరోజు విజయవంతమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రాజేశ్ అన్నారు. పీడీఎస్‌యూ 72 గంటల బంద్‌లో భాగంగా మండలంలోని పలు కళాశాలలను వారు బుధవారం బంద్ చేయించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 2024–25 సంవత్సరానికి సంబంధించి 7,200ల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. వీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు దోహదం చేయాలన్నారు. ఈ బంద్‌ను మొదటిరోజు విజయవంతం చేశారని, ఇంకా రెండు రోజులు కూడా బంద్‌పాటించి సహకరించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగిరాకపోతే పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి పోరాటం చేసేందుకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, అశోక్, ప్రభాస్, లోకేశ్, జశ్వంత్, నందీశ్వర్, విద్యార్థులు ఉన్నారు.


కళాశాలల బంద్‌ను నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా శివయాదవ్


శివయాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, దేప భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా మొహబ్బత్‌నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శివయాదవ్ నియమితులయ్యారు. బుధవారం మండల పరిధిలోని తుక్కుగూడలోని కేఎల్‌ఆర్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సామ భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు శివకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివయాదవ్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్‌టీయూసీ నిరంతరం పని చేస్తుందన్నారు. మండలంలో ఉన్న పరిశ్రమలు, కంపెనీలు, కార్మాగారాలలో పని చేస్తున్న కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు. కేఎల్‌ఆర్ నాయకత్వంలో బాధ్యతగా పనిచేస్తానని వెల్లడించారు. ఈ బాధ్యతలు అప్పగించిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డా.సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సామ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి నడికూడ శివ, మాజీ ఎంపీపీ పాండు యాదవ్, మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, గొల్లూరు రాజు, మహేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

డిప్యూటీ ఐవోఎస్‌గా వెంకట్‌రెడ్డి


వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మలక్‌పేట: సైదాబాద్–2 డిప్యూటీ ఐవోఎస్‌గా పి. వెంకట్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మలక్‌పేట హైస్కూల్‌లో పీఆర్‌టీయూ టీఎస్ సైదాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో డిప్యూటీ ఐవోఎస్‌కు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, జిల్లా బాధ్యులు ప్రశాంత్‌రెడ్డి, మందడి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సాంబశివరావు సతీష్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు


దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుందని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ విభాగాల ఆధ్వర్యంలో 4100మందితో మన్సూన్ బృందాలు అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి రోజు మూడు షిఫ్ట్‌లలో పని చేస్తారనివీరితో పాటు హైడ్రా, డీఆర్‌ఎఫ్ బృందాలతో పాటు 21 ఎమర్జెన్సీ బృందాలు 42 మందితో అందుబాటులో ఉంటారన్నారు. వర్షాకాలంలో ఎలాంటి సమస్యలున్నా 9000113667 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వైద్యులు దేవుడితో సమానం


వైద్యులను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: వైద్యులు దేవుడితో సమానమని ఎస్.ఆర్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లయన్ డాక్టర్ ఎస్.రామచంద్రరావు పేర్కొన్నారు. ఎస్.ఆర్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్యులకు వైద్యరత్న అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ ఎస్.రామచంద్ర రావు, డాక్టర్ గూడూరు సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ.. ఈ సమాజంలో పూర్వకాలం నుంచి వైద్యులకు ఎంతో పేరు ప్రాఖ్యాతలు ఉన్నాయన్నారు. అనంతరం వైద్యరత్న అవార్డు గ్రహీతలు డాక్టర్ జె.ప్రదీప్ కుమార్, డాక్టర్ షరీఫ్ ఖాన్‌షా, డాక్టర్ కొండపల్లి అపర్ణ, డాక్టర్ నవీన్ సింగ్ ఠాకూర్‌ను మొమెంటో, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ ఎస్.పి. భారతి, విశ్రాంత డిప్యూటి రిజిస్ట్రార్ ఎన్.వేణుగోపాల శర్మ, లాయర్ డాక్టర్ ఆమంచ అంజయ్య, రచయిత్రి డాక్టర్ రాధ కుసుమ, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు, డాక్టర్ బి.గంగాధర్ రెడ్డి, వి.వి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలి


మాట్లాడుతున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ వాణినగర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రైతుల రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్‌తో యువతకు ఉద్యోగాలు, సన్న బియ్యం పంపిణీ తదితర ప్రభుత్వ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. అదే విధంగా ఈనెల 4న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతున్న కాంగ్రెస్ బహిరంగ సభకు సైదాబాద్, ఐఎస్ సదన్, సంతోష్‌నగర్ డివిజన్ల నుంచి భారీ సంఖ్యల్లో తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో నాగరిగారి దాస్, గని, కోట్ల లడ్డూపటేల్, రమేష్ నాయక్, ఫిరోజ్‌ఖాన్, మహ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నేషనల్ పంచాయతీ అవార్డులపై అవగాహన


సమావేశానికి హాజరైన కార్యదర్శులు

కేశంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు. మండల పరిధిలోని అల్వాల గ్రామ రైతు వేదికలో బుధవారం నేషనల్ పంచాయతీ అవార్డు 2023–24 సంవత్సరానికి సంబంధించిన విషయాలపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేకాధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నేషనల్ పంచాయతీ అవార్డుల కోసం గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. గ్రామాల్లో పంచాయతీ ఇండెక్స్, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, పారిశుద్ధ్యం, సీనియర్ సిటిజన్ సర్వీస్‌లు, వన మహోత్సవం, మంచినీటి సరఫరాలు, జీపీకి సంబంధించి అన్ని పనుల వివరాలను పొందుపర్చాలన్నారు. అన్ని వివరాలు పక్కాగా నమోదు చేసి అవార్డులకు పోటీలో ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రశేఖర్, ఏఓ శిరీష, పీఆర్ ఏఈ నర్సింగ్‌రావు, ఏపీఎం భగవంతు, ఏపీఓ అజీజ్, మండల పశువైద్యాధికారి డాక్టర్ నివేదిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్యాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డులో మృత్యుకుహరాలు

- ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- మరమ్మతు చేయాలంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

దిల్‌సుఖ్‌నగర్: మ్యాన్‌హోళ్లు ప్రజల పాలిట మృత్యుకుహరాలుగా మారుతున్నాయి. కురుస్తున్న భారీ వర్షాలకు సరైన డ్రేనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపైనే పొంగిపొర్లుతుంది. మలక్‌పేట్ జోన్ పరిధిలోని కాలనీల ప్రజలు వర్షాకాలంలో బయట అడుగు పెట్టాలంటేనే జంకాల్సిన దుస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ మ్యాన్‌హోల్ బలి తీసుకుంటుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తప్పటడుగులు వేయాల్సి వస్తుంది.జోన్ పరిధిలోని కాలనీలు, ప్రధాన రహదారులపై గత కొంతకాలంగా మరమ్మతులకు నోచుకోక ప్రమాదకరంగా మారాయి. ప్రతి సంవత్సరం ఎంతోమంది మూతల్లేని మ్యాన్‌హోళ్ల కారణంతో మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందే.

ఇష్టానుసారంగా రోడ్ల తవ్వకాలు..

ఎన్‌టీఆర్‌నగర్, మార్గదర్శికాలనీ, శంకర్‌నగర్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, సింగరేణికాలనీ, మాదన్నపేట్, అజంపుర, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాలలో చాలా చోట్ల మూతల్లేని మ్యాన్‌హోళ్లు దర్శనం ఇస్తున్నాయి. దీనికి తోడు ఎవరి ఇష్టానుసారం వారు రోడ్ల తవ్వకాలు చేపడుతుండటంతో వాటర్, డ్రేనేజీ మ్యాన్‌హోళ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. రోడ్డుకి సమాంతరంగా ఉండాల్సిన మ్యాన్‌హోళ్లు ఎత్తుగా ఉండటంతో వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రతి సంవత్సరం అమాయక ప్రజల ప్రాణాలు బలవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక..

ఆర్‌కేపురం డివిజన్, అజంపుర, సైదాబాద్, కుర్మగూడ తదితర ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోళ్లు అధికంగా దర్శనమిస్తున్నాయి. ప్రతి వారం డ్రేనేజీలో పేరుకుపోయే మట్టిని తొలగించకపోవడం వల్ల భారీ వర్షాలకు మ్యాన్‌హోళ్లు దెబ్బతింటున్నాయి. పొగిపొర్లే మురుగునీటి ధాటికి తట్టుకోలేక మ్యాన్‌హోళ్ల మూతలు వరదనీటిలో కొట్టుకుపోతున్నాయి. సరైన డ్రేనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం ప్రజలకు ప్రాణ సంకటంగా మారుతుంది. ఎప్పటికప్పుడు నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు ఆఫీసులకే పరిమితం అవుతున్నారు. ఫలితంగా వర్షాకాలంలో ఇంటినుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి క్షేమంగా చేరుతాడనే భరోసా లేకుండా పోతుందని పలువురు భయాందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.


ఎన్‌టీఆర్‌నగర్ మెయిన్ రోడ్డు రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ప్రమాదకరంగా మ్యాన్‌హోల్